క్లుప్తంగా

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: 17వ వార్డు పరిధిలోని హౌజింగ్ బోర్డు కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని హౌజింగ్ బోర్డు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శి జయపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ టి.రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేసి, సన్మానించారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్ రూరల్: ప్రమాదకరంగా విద్యుత్ తీగలు అనే శీర్షికన సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ ఎస్.ఈ విజయేందర్ రెడ్డి, డీఈ విజయ్, రూరల్ ఇన్‌చార్జ్ ఏఈ వెంకటేష్ ఆదేశాల మేరకు విద్యుత్ కాంట్రాక్టు సిబ్బంది మండలంలోని దామ్యతండాలో వెలాడుతున్న విద్యుత్ తీగల స్థలంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో ప్రవేశాలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం గిరిపురం క్రాస్ రోడ్డులోని కస్తూర్బాగాంధీ గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్) కోర్సులో తక్షణమే ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రత్యేక అధికారిణి శ్రీలత తెలిపారు. ధ్రువపత్రాలతో కళాశాలలో హాజరై ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. వివరాల కోసం విద్యార్థినులు 88970 19492 నంబర్‌ను సంప్రదించవచ్చని ఆమె కోరారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు

మరిపెడ మండల గిరిపురం క్రాస్ రోడ్డులోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకులంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేయుటకు బీఎస్సీ నర్సింగ్-2, ఎంఏ ఇంగ్లిష్ బీఈడీ-1 ఉపాధ్యాయులు కావాలని ఆమె కోరారు. వివరాల కోసం పై నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి



కురవి: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని మహబూబాబాద్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బానోత్‌వీరన్న అన్నారు. మంగళవారం క్లబ్ సీనియర్ సభ్యుడు లయన్ చాపల రంజిత్‌రెడ్డి-డాక్టర్ అన్నపూర్ణరెడ్డి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా మండలంలోని తాట్యతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నాగమణి, హెచ్‌ఎం మంజుల, రవీందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పైపులైన్ ఏర్పాటుకు చర్యలు

డోర్నకల్: స్థానిక మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల సమీపం నుంచి వరదనీటిని తరలించేందుకు పైపులైన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఇమ్మానియల్ తెలిపారు. మంగళవారం ఆయన ఆర్‌అండ్‌బీ, మున్సిపాలిటీ సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్, ఏఈ శృతి, ఆర్‌అండ్‌బీ ఏఈ సందీప్, ప్రిన్సిపాల్ రిజ్వానా, బత్తుల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శిఖార్ఖానగడ్డలో గల శ్రీముత్యాలమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలోని శ్రీమానసాదేవి (నాగులమ్మ తల్లి) ఆలయ అష్టమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రవీందర్ రావు, ఎమ్మెల్యే సతీమణి ఉమ, రమేష్, ఉపేందర్, గిరిధరగుప్త పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకోవాలి

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో గల ఓసీ క్లబ్ స్థలాన్ని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఆగస్టు 4న చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కుమార్, నవీన్, వెంకన్న, సాంబలక్ష్మీ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు కోడిగుడ్లు సరఫరా చేయుటకు ఆసక్తి గల పౌల్ట్రీ ఫాం యజమానుల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఎం.నరసింహస్వామి మంగళవారం తెలిపారు. వివరాలకు 93901 15539 నంబరును సంప్రదించాలన్నారు.

పాలకమండలికి మోక్షం ఎప్పుడో?

- రెండేళ్లు కావస్తున్నా ఏర్పడని దేవస్థానం కమిటీ



వేంకటేశ్వరస్వామి ఆలయం

నర్సింహులపేట: మండల కేంద్రంలోని ఇంద్రకీలాద్రి పర్వతంపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి పాలక మండలి నియామకానికి ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని పలువురు ఎదురుచూస్తున్నారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆలయ చైర్మన్ కోసం పలువురు ఆశావహులు ప్రదక్షణలు చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వంలో ఆలయానికి చైర్మన్‌గా పనిచేసిన బొల్లం రమేశ్ 2024లో పదవీ కాలం పూర్తి అయింది. సుమారుగా 17నెలల నుంచి ఆలయానికి పాలక మండలి లేదు. 2024 డిసెంబర్‌లో పాలక మండలి నియామకం అయిందని, చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన వేముల జయపాల్‌రెడ్డి నియామకం అయినట్లు ఆర్డర్ కాపీ వచ్చిందని, ప్రమాణస్వీకారం రేపో.. మాపో అని జోరుగా ప్రచారం జరిగింది. కానీ ఇంతలోనే ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ వచ్చిందని ప్రమాణస్వీకారం ఆపేశారు. కోడ్ పూర్తయ్యే సరికి, చైర్మన్‌గా పదవికి ప్రమాణస్వీకారం చేసే నెలరోజుల గడువు పూర్తి కావడంతో అట్టి నియామకం రద్దు అయినట్లు ఆలయ అధికారులు ప్రకటించడంతో నాయకులు అయోమయంలో పడ్డారు. మళ్లీ నోటిఫికేషన్ వస్తుందని అధికారులు చెప్పడంతో చైర్మన్ కోసం పోటీ పడే నాయకులకు చివరికి ఎదురుచూపులే మిగిలాయి. ఆలయంలో పాలక మండలి లేకపోవడంతో రెండు పర్యాయాలు పెద్ద ఎత్తున అధికారులే బ్రహ్మోత్సవాలను కష్టతరంగా నిర్వహించారు.

ఫుడ్‌పాయిజన్‌పై పట్టింపేది?

- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

కురవి: సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ జరిగినా పట్టించుకోవడంలేదని, మూడు చావులు.. ఆరు బెడ్లు అన్న చందంగా మారిందని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ విమర్శించారు. మండల కేంద్రంలో శ్రీరాంజగన్నాథం దంపతులను పరామర్శించిన అనంతరం మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలను మోసం చేసేందుకు మరోమారు ఢిల్లీ డ్రామా ఆడుతున్నారని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల విషయం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండగా అసెంబ్లీలో ఆర్డినెన్స్ తీసుకొచ్చి గవర్నర్‌కు పంపించడం తెలివి తక్కువ తనంగా ఆమె అభివర్ణించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీకు సబ్‌ప్లాన్ కమిషన్ వేసి రూ.20వేల కోట్లు కేటాయిస్తామని మాటలు చెప్పారని, అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్‌ప్లాన్‌ను ఏం చేశారన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ఐలి నరహరి, బోడ శ్రీను, బాదె నాగయ్య, అల్లూరి కిశోర్‌వర్మ, నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు



సమస్యలను తెలుసుకుంటున్న వెంకట్రాములు

గార్ల: వైద్యులు, వైద్యసిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా డీసీహెచ్‌ఎస్ బి.వెంకట్రాములు అన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగుల వార్డులను సందర్శించి ఆసుపత్రిలో వైద్యసేవలు ఎలా ఉన్నాయి అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యసిబ్బంది మర్యాదగా మాట్లాడాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యుల కొరతను తీర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీధర్‌గౌడ్, డాక్టర్లు సతీష్, రాజ్‌కుమార్ జాదవ్, హనుమంతరావు, నర్సింగ్ ఆఫీసర్ స్వాతి, నర్సులు ఉన్నారు.

బీసీల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



మాట్లాడుతున్న వీరన్నయాదవ్

కేసముద్రం: బీసీల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని పీసీసీ ఓబీసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్నయాదవ్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి కేసముద్రంవిలేజ్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వెన్నంటే ఉంటూ, అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. బీసీల రిజర్వేషన్ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు కత్తెరశాల శ్రీనివాస్, చిట్ల రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్, ఓబీసీ ప్రెసిడెంట్ సంపత్, శ్రీను, రమేష్, వెంకన్న, మహేందర్ పాల్గొన్నారు.

ఉత్తమ పాఠశాలగా మోడల్ స్కూల్ ఎంపిక



వేడుకల్లో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

నెల్లికుదురు: ఉత్తమ పాఠశాలగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఎంపిక అయినట్లు ఎంఈఓ రామ్‌దాస్ అన్నారు. మంగళవారం ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు, అధ్యాపకులతో కలిసి ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ఎంఈఓ మాట్లాడారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 అమలుకు ఐదేళ్లు పూర్తి అయినందున దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా జిల్లాలోని నెల్లికుదురు ఆదర్శ పాఠశాల పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పురస్కారం పాఠశాలలో అమలవుతున్న నాణ్యతా ప్రమాణాలు, విద్యా విధానానికి అనుగుణంగా అభివృద్ధి చర్యలు, విద్యార్థుల సాధన, సాంకేతికత వినియోగం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ అరుణ్‌కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

మహబూబాబాద్ రూరల్: చోరీ ఘటనలో ఒక వ్యక్తికి ఏడాది జైలు శిక్ష, రూ.పదివేలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ స్వాతిమురారి మంగళవారం తీర్పుఇచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి ధరావత్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వేల్పుల సత్యం నగర్‌కాలనీలో నివాసం ఉండే పత్తిపాక జనార్దన్ ఇంట్లో 2024 ఆగస్టు 28వ తేదీన చోరీ జరిగింది. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై వి.విజయరాంకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బండ సంపత్ ను చోరీకి బాధ్యుడిగా గుర్తించారు. నేరం నిరూపణకాబడిన సంపత్‌కు ఏడాది జైలు శిక్ష, జరిమానా విధించారు.


మద్యం తాగొద్దని మందలించినందుకు ఆత్మహత్య

బయ్యారం: మద్యం తాగొద్దని భర్త తన భార్యను మందలించినందుకు గడ్డిమందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని భీమ్లాతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన బాణోత్ బుచ్చి(38) కుమారుడు 15 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుంచి మద్యానికి బానిసైంది. సోమవారం మద్యం తాగిన భార్యను భర్త మందలించటంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగింది. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి భర్త రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తొర్రూరు రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన దామసాని ఐలయ్య(60) అనే వ్యక్తి తన వ్యక్తిగత పనుల నిమిత్తం వెలికట్ట గ్రామానికి వెళ్లాడు. తిరిగి కాలినడకన వస్తుండగా వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఉపేందర్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

మహాత్మా జ్యోతిరావు పూలే అవార్డుకు ఎంపిక



నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం ఎంపీపీఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కుండే చైతన్యకు మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్ అవార్డుకు ఎం ఎంపికయ్యారని స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఫౌండర్ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేశ్ మంగళవారం తెలిపారు. ఆగస్టు 30న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మరిపెడ రూరల్: ఫోర్త్ జోన్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు మరిపెడ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలుర)లో ఈనెల 31న ఈ విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో స్పాట్ ప్రవేశాలు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ సామాల దయాకర్ తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ఎంపికైన వారికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. పదో తగరతిలో 400మార్కులు పైగా సాధించిన విద్యార్థులకు ఈ నెల 31న ఉదయం 9 గంటలకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరానికి ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాక్విలిన్ మంగళవారం తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ గురుకులంలో..

తొర్రూరు: స్థానిక ఎస్సీ గురుకుల పాఠశాలలో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 31న పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ విజయరత్నమాల అన్నారు.

పాఠశాల తనిఖీ

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) శివారు గుజిలి తండాలోని ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ వీరబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు.

లైన్‌తండాలో పోలీసుల కార్డన్‌సెర్చ్



గూడూరు: లైన్‌తండాలో పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

గూడూరు: గ్రామాలో నిషేధిత వస్తువుల అమ్మకాలు, రవాణ, మద్యం అమ్మకాలు నిలిపివేయాలని గూడూరు సీఐ సూర్యప్రకాశ్ హెచ్చరించారు. మండలంలోని లైన్‌తండాలో మంగళవారం సీఐ ఆధ్వర్యంలో గూడూరు, గంగారం ఎస్సైల పర్యవేక్షణలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా 300 కేజీల పటిక, 2000 లీటర్ల బెల్లం పానకం, 100కేజీల నల్లబెల్లం, బెల్టుషాపుల్లో మద్యం సీసాలు వాటితోపాటు 20ద్విచక్రవాహనాలు, 2ఆటో రిక్షాలు తనిఖీ చేసి జరిమానా విధించారు. కార్యక్రమంలో గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి, గంగారం ఎస్సై రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని ఎర్రకుంటతండా శివారు సురేష్‌నగర్‌లో సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు విశ్వసనీయ సమాచారంతో ఓ ఇంటిపై దాడి నిర్వహించారు. 12క్వింటాళ్ల నల్లబెల్లం నిల్వ చేసి ఉండగా స్వాధీనం చేసుకొని, ఇంటి యజమానిని అదుపులోకి తీసుకొని గూడూరు పోలీసులకు అప్పగించారు. మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

మహబూబాబాద్ రూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని రూరల్ సీఐ పి.సర్వయ్య అన్నారు. రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని గాంధీపురం గ్రామంలో మంగళవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రెండు క్వింటాళ్ల నల్లబెల్లం, 20లీటర్ల గుడుంబా, 300లీటర్ల బెల్లం పానకం, 11మోటార్ సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ ఎస్సై జితేందర్, రూరల్, కురవి, ఆర్‌ఎస్సై, కేసముద్రం, టౌన్ ఎస్సైలు దీపిక, కరుణాకర్, పుల్లారావు, నరేష్, రవికిరణ్, మౌనిక, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

గూడూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పాటుపడాలని జిల్లా నాయకులు నాయిని ధర్మారెడ్డి, చెల్పూరు వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు జిల్లా పర్యటనకు నేడు వస్తున్న సందర్భంగా కార్యకర్త తరలివెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లు, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకుడు రాంబాబునాయక్, దేవేందర్‌నాయక్, నాగరాజు, మల్లయ్య, భద్రూనాయక్, వెంకన్న రవి, అనిల్, శ్రీను పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి పూజలు



గూడూరు: పాలు పోస్తున్న భక్తులు



మహబూబాబాద్ రూరల్: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో మంగళవారం నాగుల పంచమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ముందుగా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, పుట్టలో పాలు పోసి నాగేంద్రస్వాని వేడుకున్నారు.

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని నాగేంద్ర స్వామి గుడిలో నాగేంద్ర స్వామి, సుబ్రహ్మణ్య స్వామి వారికి మంగళవారం భక్తులు అభిషేకం చేసి, పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

డోర్నకల్: స్థానిక రైల్వే కాలనీలో నాగేంద్రస్వామి ఆలయంలో నాగులపంచమిని పురస్కరించుకుని మహిళలు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

బాలికలకు ఆత్మరక్షణ విద్య అవసరం

మహబూబాబాద్ అర్బన్: బాలికలకు ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు అన్నారు. సౌత్ జోన్ ఖేలో ఇండియా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన మోడల్ స్కూల్ విద్యార్థులను మంగళవారం ఉపాధ్యాయులు అభినందించారు.

సీపీఎస్ రద్దుకు ఉద్యమించాలి

గూడూరు: ఉద్యోగులందరూ సీపీఎస్ రద్దు కోసం ఉద్యమించాలని, అందుకోసం సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మిర్యాల సతీష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో రవిచంద్ర, వెంకటేశ్వర్లు, గోపినాథ్, బాలయ్య పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చకుంటే ఉద్యమిస్తాం..

తొర్రూరు: యూరియా కొరత తీర్చకుంటే ఉద్యమిస్తామని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయిలు స్పష్టం చేశారు. డివిజన్ కేంద్రంలోని ఏఐకేఎంఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యాకన్న, భిక్షపతి, సాయిలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

కురవి: యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చర్య తీసుకుని రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని మరిపెడ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మానుకోట ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అజ్మీరా శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో మంగళవారం సుధాకర్‌రెడ్డి కలిశారు.

వైద్యం అందుబాటులో ఉంచాలి

బయ్యారం: ప్రభుత్వ వైద్యం పేదలకు అందుబాటులో ఉంచాలని కోరుతూ మంగళవారం పీవైఎల్ ఆధ్వర్యంలో బయ్యారం పీహెచ్‌సీ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుడుం వీరభద్రం మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, లక్ష్మినారాయణ, శేషు, రమేష్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

కొత్తగూడ: గంగారం మండలం మారుమూల గ్రామం కామారానికి చెందిన శ్రీవాని అనే మహిళ పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు కాల్ చేశారు. వెంటనే అంబులెన్స్‌లో కొత్తగూడ పీహెచ్‌సీకి తరలిస్తున్న క్రమంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ కవిత పురుడు పోసింది. శ్రీవాణి మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డా క్షేమంగా ఉన్నారు.

ఆగస్టు 3నుంచి బోనాల వేడుకలు

మహబూబాబాద్ రూరల్: శ్రావణమాసం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో ఆగస్టు 3నుంచి 21వ తేదీ వరకు ముత్యాలమ్మ బోనాలు జరుగుతాయని బొడ్డుపల్లి వెంకటయ్య, వెంకటనారాయణ, వెంకన్న, మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం మంగళవారం తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నర్సింహులపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఎంపీడీఓ రాధిక అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టళ్లను ఎంపీడీఓ తనిఖీ చేశారు.

మోడ్రన్ ధోబీఘాట్ పరిశీలన

డోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డులోని మోడ్రన్ ధోబీఘాట్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ పరిశీలించారు. సుమారు రెండు కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన దోబిఘాట్‌లో రెండు ఆధునిక వాషింగ్ మిషన్లు, డ్రై మిషన్లు, ఐరన్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఈ శృతి, సిబ్బంది కిశోర్, సాయి పాల్గొన్నారు.

సరైన పరిహారం అందించాలి

నెల్లికుదురు: నేషనల్ హైవే నిర్మాణంలో సాగు భూములను కోల్పోతున్న రైతులకు ఇప్పుడున్న డిమాండ్ ప్రకారం సరైన పరిహారం అందించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల యాదవరెడ్డి కోరారు. ఈమేరకు హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో కలిసి తహసీల్దార్ చంద నరేష్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు.

రహదారి పనులు వెంటనే చేపట్టాలి

గూడూరు: మండలంలోని బొద్దుగొండ వద్ద హైపవర్ విద్యుత్ లైన్ కింద పూర్తికాని జాతీయ రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మాలోతు రవీందర్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ప్రమాదకర ఎన్‌హెచ్ రహదారిని చూపుతూ మాట్లాడారు.

ధర్నాను విజయవంతం చేయాలి

మహబూబాబాద్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు యాకుబ్, రమేష్, దేవేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మైస శ్రీనివాస్, సంజీవ, ఉపేందర్, భిక్షపతి, రామలింగా రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి

తొర్రూరు: అన్ని కేడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని యూఎస్పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు ఏ.మురళీకృష్ణ, సూరం ఉపేందర్‌రెడ్డిలు కోరారు. ఆగస్టు 1న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ప్రతినిధులు నాగమల్లయ్య, కొండం జనార్దన్, తిరుమలేష్, కొలుపుల శ్రీను, ఈదురు రమేష్, బొమ్మెర కృష్ణ, దర్గయ్య పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



డోర్నకల్: స్థానిక రైల్వే సంఘభవన్ కార్యాలయంలో మంగళవారం డోర్నకల్ లయన్స్‌క్లబ్ 8వ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా కందుల నరేష్, సెక్రెటరీగా టి.శ్రీనివాసచౌదరి, కోశాధికారిగా బద్దెల వెంకటేశ్వర్లు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో క్లబ్ పీడీజీ టి.లక్ష్మినర్సింహరావు, సెక్రెటరీ వెంకటరెడ్డి, జోన్ చైర్మన్‌వెంకటరెడ్డి, రేగూరి వెంకన్న పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

డోర్నకల్: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం డోర్నకల్ పోలీసుల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. డ్రైవింగ్ నిబంధనలు పాటించాలని, గ్రామాల్లో అపరిచితుల సమాచారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై వంశీధర్, గడ్డం ఉమ పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే ప్రాజెక్ట్ వ్యయం పెంపు

గార్ల: కమీషన్ల కోసమే సీతారామ ప్రాజెక్ట్ వ్యయంను పెంచారని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంపాల విశ్వ ఆరోపించారు. మంగళవారం గార్లలో ఆయన మాట్లాడారు. పాలకులు కళ్లుతెరిచి ఏజెన్సీ ప్రాంత రైతుల భూములకు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవం





ఝాన్సీరెడ్డి, తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న కులపెద్దలు

తొర్రూరు రూరల్: కుల దేవతలను పూజించడం ద్వారా భక్తిభావం పెంపొందుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చెర్లపాలెంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని ప్రారంభించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఝాన్సీరెడ్డిని సత్కరించారు.. తన సొంత ఖర్చులతో నిర్మించిన దాత, తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డిని కులపెద్దలు సన్మానించారు.

'భద్రకాళి'కి సారె సమర్పించిన భక్తులు



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

హన్మకొండ కల్చరల్: మహబూబాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్ట్ సౌజన్యంతో భక్తులు భద్రకాళి అమ్మవారికి సారెను సమర్పించారు. మంగళవారం ఉదయం ట్రస్ట్ అధ్యక్షుడు బి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ రత్నాహోటల్ నుంచి 300 మంది భక్తులు ర్యాలీగా బయలుదేరి భద్రకాళి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు, ధర్మకర్తల మండలి చైర్మన్ డాక్టర్ బండారు శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు స్వాగతించారు. అ నంతరం భక్తులు అమ్మవారికి చీర, సారె, 51 రకాల స్వీట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు వీరన్న, శ్రవణ్‌కుమార్, పూర్ణచందర్, క్రాంతి, సతీష్, మయూరి, స్రవంతి, సుగుణ పాల్గొన్నారు.